నగరం@44


నిర్మానుష్యంగా కంబాలచెరువు సెంటర్

- నింగిన సూరీడు నెత్తికి దిగొచ్చినట్టు
- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే అధికంగా నమోదు

సీటీఆర్ఐ: న'గరం'లో... బయటకు వస్తే భగభగలే. ఇంట్లో ఉంటే సెగలే.. అన్నట్లు ప్రస్తుతం సామాన్యుడు నరక కుంపటిలో చిక్కుకున్నాడు. అంతకంతకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు జనానికి ఊపిరాడనివ్వడం లేదు.. నింగిన సూరీడు నేలకు దిగొచ్చాడా అన్నట్లు వేడి పెరిగిపోయింది. గత ఆరు రోజులుగా 44, 42, 40, 41, 42, 44 గ్రీల ఉష్ణోగ్రతలు రాజమహేంద్రవరంలో నమోదయ్యాయి. 40 డిగ్రీలు మించే ఏ రోజుకారోజు ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. శనివారం 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నగరంలో ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు వేశారు. భూమిలోకి నీరు ఇంకే పరిస్థితి లేదు. ఇది మరింత వేడి పెరగడానికి కారణమవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. స్థానిక వై.జంక్షన్ రోడ్డు నుంచి సెంట్రల్ జైలు రోడ్డు వరకూ, క్వారీ మార్కెట్ నుంచి కంబాలచెరువు వరకూ, ఇలా తదితర చోట్ల అభివృద్ధి పేరిట చెట్లు నరికేశారు. వేడి పెరగడానికి ఇది మరో కారణం.

మరో పది రోజులు ఇలానే..

మరో పది రోజులు ఉష్ణోగ్రతలు ఇలానే ఉంటాయని హెచ్చరిస్తుండడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. మార్చి నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పుడు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. పగటి వేళ భానుడు తన ప్రతాపం చూపడంతో రాత్రి 11 గంటల వరకూ వేడి గాలులు వీస్తున్నాయి.

చెట్లను నరికేయడంతో..


ముప్పై ఏళ్ల కిందట రాజమహేంద్రవరం అంతా పచ్చగా ఉండేది. ఎక్కడ చూసినా చెట్లతో నిండుగా కనిపించేది. అప్పట్లో రోడ్లకిరువైపులా చెట్లు ఉండటంతో ఎండ వేడిమి తక్కువగా ఉండేది. సాయంత్రం సేద తీరడానికి గోదావరి గట్టు వద్దకు వెళ్తే చల్లగాలులు వీచేవి. ఇప్పుడు నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పేరుతో చెట్లను నరికి వేస్తున్నారు. దీంతో ఎండ పెరిగిపోయింది. – ఎస్.భాస్కరరెడ్డి, నగరవాసి

పచ్చదనమే మనకు రక్ష


పచ్చదనాన్ని కాపాడుకుంటే అదే మనకు శ్రీరామ రక్ష అవుతోంది. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను పెంచితే ఆక్సిజన్ కూడా విరివిగా లభిస్తుంది. నేటి పరిస్థితులు ఇలాగే కొనసాగితే ముందు ముందు ఇంకా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఇంటి చుట్టూ పచ్చని మొక్కలు పెంచడంతో ఎండ వేడి నుంచి రక్షణ పొందవచ్చు. – ఎస్‌పీ రామచంద్రరావు, విద్యావేత్త, రాజమహేంద్రవరం

జనం నిల్.. వ్యాపారాలు డల్

నగరంలో పలు ప్రాంతాలు చిరు వ్యాపారులకు వ్యాపార కూడళ్లుగా ఉన్నాయి. ఇందులో ప్రధానంగా మెయిన్ మార్కెట్, ఆర్ట్స్ కళాశాల నుంచి సెంటర్ జైలు రోడ్డు, కంబాలచెరువు జంక్షన్, శ్యామలా సెంటర్, గోకవరం బస్టాండ్ సెంటర్, తాడితోట జంక్షన్ ఉంటాయి. ఉదయం నుంచే వేడి గాలులు మొదలవుతుండడంతో జనం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. వేడి గాలులకు, వ్యాపారాలు కూడా లేకపోవడంతో చిరు వ్యాపారులు రోడ్లపైకి రావడం లేదు. మధ్యాహ్నమైతే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చేవారు ముఖానికి రక్షణ కవచాలు ధరించి వస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో నగరంలో ఏసీలు, రిఫ్రిజరేటర్ల వినియోగం బాగా పెరిగింది. దీంతో కరెంట్ వినియోగం సైతం అధికమైంది.

క్లుప్తంగా

దేవస్థాన ట్రస్టు బోర్డు చైర్మన్‌గా అరిగెల


రాజమహేంద్రవరం రూరల్: నగరంలో ప్రసిద్ధి గాంచిన ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవస్థానానికి నూతన పాలక మండలిని నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేవస్థాన ట్రస్టు బోర్డు చైర్మన్‌గా అరిగెల బాబూ నాగేంద్రప్రసాద్, సభ్యులుగా సుంకర విజయలక్ష్మి, కామారెడ్డి దేవీ పోశమ్మ, యలమంచిలి నాగరాజు, గుడే పార్వతి, పలివెల వెంకటరమణ, వంగా ఉమామహేశ్వరరావు, మద్రి వెంకటనాథ్, కరసు లక్ష్మీశైలజ నియమితులయ్యారని వివరించారు. చైర్మన్, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధి దిశగా పాటుపడాలని ఎంపీ భరత్ కోరారు.

కోర్టు నిర్ణయం శుభపరిణామం

ప్రకాశంనగర్: ఢిల్లీలో అధికారం ఆమ్‌ఆద్మీ ప్రభుత్వానిదే అని గురువారం కోర్టు తేల్చి చెప్పడం శుభ పరిణామమని ఆ పార్టీ నగర కన్వీనర్ అత్తిలి రాజు శనివారం హర్షం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణంలో ముడుపులు తీసుకున్నారంటూ ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియాపై నమోదైన అభియోగాలు నిరాధారమైనవని ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆమ్‌ఆద్మీ పార్టీ నిబద్ధత స్పష్టమైందన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నగర ఆ పార్టీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయదుందుభి మోగించడంతో శనివారం స్థానికంగా పార్టీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. కంబాలచెరువు వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో మళ్లీ దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్టిన్‌లూథర్, పీసీసీ కార్యదర్శి ముళ్ల మాధవ్, నలబాటి శ్యామ్, చామర్తి లీలావతి, యిజ్జరౌతు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చార్జిషీట్ కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టును ఒక ఏటీఎంలా వాడుకున్నారని, ప్రస్తుత ప్రభుత్వం కంబాలచెరువు అభివృద్ధి పనులను పేటీఎంగా వాడుకుంటుందని బీజేపీ నగర ఇన్‌చార్జ్ యెనుమల రంగబాబు అన్నారు. శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి త్రీటౌన్ స్టేషన్‌లో చార్జిషీట్ అందజేశారు. పుష్కరఘాట్ వద్ద సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.

రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు

ప్రకాశంనగర్: స్థానిక జ్ఞాన సరస్వతి ఘాట్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. తోట సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రవిశంకర్ గురూజీ శ్వాస ప్రక్రియ, సుదర్శన క్రియల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది జీవితాల్లో ప్రేమ, శాంతి, ఆనందం, కరుణ నింపాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థను స్థాపించారని చెప్పారు. డీడీసీ సభ్యుడు కృష్ణారావు మాట్లాడుతూ రవిశంకర్ గురూజీ జీవిత విశేషాలను తెలిపారు. టీచర్లు ఏవీ రమణ, ఎన్వీ శ్రీనివాసరావు, జి.పద్మావతి, గంటి కామాక్షి, నీలం వెంకట శ్రీనివాసరావు, డాక్టర్ అనుసూరి పద్మలత పాల్గొన్నారు.

భర్త దాడి చేశాడంటూ ఫిర్యాదు

సీతానగరం: తన భర్త కత్తితో దాడి చేసినట్లు ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. చీపురపల్లికి చెందిన పెద్దే నాగమణి, అర్జున్ భార్యభర్తలు. వరకట్నం కోసం భర్త వేధిస్తున్నట్లు 2020 నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా నాగమణి కువైట్ వెళ్లింది. మూడు నెలల కిందట కువైట్ నుంచి తిరిగి వచ్చింది. శనివారం నీటి కోసం కుళాయి వద్దకు నాగమణి వెళుతుండగా మద్యం మత్తులో అర్జున్ కత్తితో దాడి చేశాడు. ఆమె మెడ, నడుము, కుడి చేతిపై నరకడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో కుట్లు వేశారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నాగమణి స్థానిక పోలీసులను ఆశ్రయించింది.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


ఇన్నీసుపేటలో వేసవి శిక్షణ తరగతుల్లో తాము తయారు చేసిన క్రాఫ్ట్ ఫ్లవర్స్‌తో విద్యార్థులు

కడియం: గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన సాధ్యమవుతుందని గ్రంథాలయ అధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల అన్నారు. శనివారం కడియం గ్రంథాలయంలో ఆరో రోజు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో భాస్కరరావు, వెంకటేశ్వరరావు కథలు చదివించారు. స్పోకెన్ ఇంగ్లిష్‌పై కె.శ్రీను వివరించారు. అనంతరం యోగాసనాలు వేయించారు. దుర్గయ్య, అబ్బులు, సీతారాం, కండవల్లి వీరశంకర్, వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రకాశంనగర్: సీతంపేట గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగాయి. ఉపాధ్యాయులు కృష్ణశర్మ, వి.సత్యనారాయణ మూర్తి, పిచ్చుక రాంబాబు విద్యార్థులకు పలు అంశాలు వివరించారు. క్రాఫ్ట్ టీచర్ ఐ.రాజ్‌కుమార్ చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి కె.సుగుణకుమారి మాట్లాడుతూ జూన్ 11 వరకూ వేసవి శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, చదరంగం పోటీలు, తెలుగు పద్యాలు, లలిత సంగీతం తరగతులు జరిగాయి. బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గేదెల వేంకటేశ్వరరావు విద్యార్థులకు మజ్జిగ వితరణ చేయగా, విశ్రాంత ఎల్‌ఐసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అడివి శివరామ్ బిస్కెట్లు పంచి పెట్టారు. ట్రస్టు సభ్యుడు బొడ్డు శ్రీనివాసరావు, వరలక్ష్మి, అల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శుభవార్త



సమావేశంలో మాట్లాడుతున్న గోదావరి హజ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎండీ హబీబుల్లా బేగ్

రాజమహేంద్రవరం సిటీ: హజ్ యాత్రకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గోదావరి హజ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎండీ హబీబుల్లా బేగ్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక నెహ్రూనగర్ షాదీ ఖానాలో హజ్ యాత్రికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో ముస్లింకు అయ్యే రూ.80 వేలను సీఎం జగన్ మంజూరు చేస్తున్నారని, ఈ నగదు రెండు రోజుల్లో బ్యాంకు ఖాతాలో పడతాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు వరాలు కురిపిస్తుందన్నారు. ప్రభుత్వ ఖాజీ మౌలానా కరీ ముల్లా మాట్లాడుతూ ఇటీవల సామాజిక మాధ్యమాల ద్వారా హజ్ యాత్రకు సంబంధించి యాత్రికులను గందరగోళపరిచేలా సందేశాలు వస్తున్నందున ప్రభుత్వ పరంగా ముస్లిం సోదరులకు వాస్తవాలు వివరిస్తున్నామన్నారు. ఇప్పటికే హజ్ యాత్రకు విజయవాడ నుంచి వెళ్తే అయ్యే వ్యయానికి, హైదరాబాద్ నుంచి వెళ్తే అయ్యే వ్యయానికి మధ్య వ్యత్యాసం ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేస్తున్నారన్నారు. వ్యయం తగ్గించడానికి అవసరమైతే హైదరాబాద్ నుంచి హజ్ పంపడానికి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఎండీ అమానుల్లా బేగ్, సయ్యద్ సమీ, ఎండీ ఇమ్రాన్, ఎండీ నసీరుల్లా బేగ్, ఎండీ సాజిద్, సయ్యద్ హబీబ్, ఎండీ ఖలీషా పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీరికి వచ్చే నెల 2 నుంచి పరీక్షలు ఉండడంతో హెచ్‌ఎం పుష్పలత ఆధ్వర్యంలో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. రోజూ ఆయా సబ్జెక్ట్‌లపై పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. సుమారు 35 మంది విద్యార్థులకు గాను 30 మంది హాజరవుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సైన్స్, సోషల్, గణితంలో తరగతులను ఉపాధ్యాయులు కస్తూరి సతీష్‌బాబు, ముస్తాఫా, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం నిర్వహిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సీతానగరం: ఉండేశ్వరపురానికి చెందిన సింహాద్రి సురేష్‌బాబును కత్తితో పొడిచిన ఉప్పలపాటి శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణరావు శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. ఉప్పలపాటి శ్రీనివాసరావు తన భార్యతో గొడవపడి మూడు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉంటున్నాడు. కేంద్రం వద్ద ఉమ్ములు, మల, మూత్రవిసర్జన వంటివి చేయడంతో అంగన్‌వాడీ టీచర్ వెంకట జయశ్రీ తన కుమారుడు సురేష్‌బాబుకు తెలిపింది. శ్రీనివాసరావును శుక్రవారం రాత్రి సురేష్‌బాబు మందలించాడు. దీంతో సురేష్‌బాబును కత్తితో పొడిచి, చేతులపై నోటితో కరిచాడు. బాధితుడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని, నార్త్‌జోన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు విచారణ జరుపుతారని హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు.

రేపు వర్జీనియా పొగాకు వేలానికి అనుమతి

సీతానగరం: దేవరపల్లి టుబాకో బోర్డులో సోమవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన వర్జీనియా పొగాకు బేళ్ల అమ్మకానికి బేళ్లు తీసుకురావాలని టుబాకో బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ ప్రణీత్ శనివారం తెలిపారు. రఘుదేవపురం, చినకొండేపూడి, రాజంపేట, రాపాక, సీతానగరం, వెదుళ్లపల్లి గ్రామాల్లోని వర్జీనియా పొగాకు రైతులు ఒక్కో బ్యారన్‌కు రెండు బేళ్ల చొప్పున దేవరపల్లి టుబాకో బోర్డుకు సోమవారం తీసుకు రావాలన్నారు. ఒక్కో బేలు 150 కిలోలకు మించి ఉండరాదన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు బేళ్లను కాటా వేస్తారని, తదుపరి వేలం నిర్వహిస్తామని వివరించారు.

నేడు రాజానగరంలో శోభాయాత్ర


రాజానగరంలో ఆంజనేయస్వామి ఆలయం

రాజానగరం: హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాజానగరంలో శోభాయాత్ర (బైకు ర్యాలీ) జరుగనుంది. ఇది సాయంత్రం 4 గంటలకు స్థానిక జెడ్పీ హైస్కూల్ జంక్షన్ వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుంది. అలాగే ఆలయం వద్ద హోమం జరుగనుంది. హనుమత్ జయంతిని వైభవంగా నిర్వహించేందుకు రాజానగరం, సూర్యారావుపేట, పుణ్యక్షేత్రం, నరేంద్రపురం, వెలుగుబంద, చక్రద్వారబంధం, కానవరం తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం

- యువత కోసం ఓపెన్ జిమ్‌ల నిర్మాణం
- త్వరలో బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నంలలో ప్రారంభం


బూరుగుపూడిలో అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైన ఓపెన్ జిమ్

మధురపూడి: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి. దీనికి వ్యాయామ శాలలు (జిమ్) ఎంతగానో ఉపయోగపడతాయి. యువతను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి గ్రామీణ ప్రాంతాల్లో వ్యాయామ శాలల నిర్మాణం జరుగుతోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో సహకారం అందిస్తోంది. అధిక నిధులు కేటాయిస్తుంది. ఇందులో భాగంగానే రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సారథ్యంలో బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నం గ్రామాల్లో ఓపెన్ వ్యాయామ శాలలను నిర్మించారు. వీటిని అన్ని హంగులతో సిద్ధం చేశారు. ఇవి త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రుడా ఆధ్వర్యంలో నిర్మించిన ఈ వ్యాయామ శాలలకు ఆయా పంచాయతీలు ఖాళీ స్థలాలను అందించాయి. కాగా వీటి నిర్మాణం, వివిధ రకాల వ్యాయామ పరికరాలను సైతం రుడా సమకూర్చింది. అంతేకాకుండా వ్యాయామం చేయడానికి అనువుగా పరిసరాలను తీర్చిదిద్దారు. ఒక్కో వ్యాయామ శాలకు రూ.20 లక్షల చొప్పున కేయించి నిర్మించారు.

సకల సౌకర్యాలతో..

ప్రస్తుతం పోలీస్, ఆర్మీ, నేవీ తదితర పోస్టులకు శారీరక దృఢత్వం చాలా అవసరం. అంతేకాకుండా ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి. యువతకు అనుకూల వేళల్లో జిమ్ చేసుకోవడానికి అనువుగా ఈ వ్యాయామ శాలలను తీర్చిదిద్దారు. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో యువత వ్యాయామం చేసేందుకు రానున్నారు. ఓపెన్ జిమ్‌గా పిలిచే ఈ వ్యాయామ శాలల్లో పది రకాల పరికరాలను ఏర్పాటు చేశారు. ఇందులో వాకింగ్ పర్పస్, వెయిట్ లిఫ్టర్ తదితర పరికరాలను అందుబాటులో ఉంచారు.

సాక్షి-సినిమాలు



శ్యామల:	రామబాణం
సూర్యమినీ:	గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ
సూర్యప్యాలెస్:	రామబాణం
స్వామి:	రామబాణం
శివజ్యోతి:	కస్టడీ
అనుశ్రీ:	విరూపాక్ష
రాజా:	విరూపాక్ష
అశోక:	ఉగ్రం
ఊర్వశి:	ఫర్హానా
రంభ:	భువన విజయం
మేనక:	కళ్యాణమస్తు, మ్యూజిక్ స్కూల్
అప్సర:	కస్టడీ
నామవరం:	
వీఎస్.మహల్:	కస్టడీ
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	కస్టడీ
కడియం:	
వెంకటసూర్య:	కస్టడీ